### రాత్రివేళలోనూ రాజన్న దర్శనం

వేములవాడ టౌన్, జనవరి 21: మేడారం జాతర సమీపిస్తుండడంతో వేములవాడ రాజన్నకు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు నేటి ఆదివారం నుంచి ఫిబ్రవరి 18 వరకు ఆదివారాల్లో రాత్రివేళల్లోనూ స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించారు. రాత్రివేళల్లోనూ కోడె, ఇతర మొక్కులు చెల్లించుకోవచ్చని ఆదివారం తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### పదిమంది సీఐలకు స్థానచలనం

రాంనగర్/ ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 21: మల్టీజోన్ పరిధిలో పది మంది సీఐలకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. భూపాలపల్లిలో పనిచేస్తున్న రామ్ నర్సింహారెడ్డి ధర్మపురి సర్కిల్‌కు బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న జీ సతీశ్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించారు. కరీంనగర్ సీసీఆర్బీలో పనిచేస్తున్న దామోదర్ రెడ్డి మల్యాల సర్కిల్‌కు బదిలీ కాగా, అక్కడికి పది రోజుల క్రితమే బదిలీపై వెళ్లిన నాగేశ్వరరావును జగిత్యాల సీసీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇటీవలే జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా వెళ్లిన బుద్ధ స్వామిని రామగుండం సీసీఆర్బీకి, అక్కడ పనిచేస్తున్న ఆకుల అశోక్‌ను ఐజీ కార్యాలయానికి పంపారు. నిర్మల్ జిల్లా డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ నాగపురి శ్రీనివాస్‌ను భీమ్‌గల్ సర్కిల్‌కు, అక్కడ పనిచేస్తున్న అంకటి వెంకటేశ్వర్లు ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రస్తుతం సీఐడీలో పనిచేస్తున్న పీ శ్రీలత కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇవ్వగా, అక్కడ పనిచేస్తున్న బీ శ్రీనివాస్‌ను ఐజీ కార్యాలయానికి పంపారు.


మేయర్ వై సునీల్‌రావుకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

## మెగా హెల్త్ క్యాంప్ సక్సెస్

**లయన్స్ క్లబ్, ప్రతిమ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ**

విద్యానగర్, జనవరి 21: కరీంనగర్‌లటోని పేద ప్రజల కోసం లయన్స్ క్లబ్, ప్రతిమ దవాఖానల ఆధ్వర్యంలో భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సూపర్ స్పెషాలిటీ ఉచిత మెగా వైద్య శిబిరం సక్సెస్ అయింది. నగరంలోని పేద ప్రజలు తరలివచ్చారు. ఇక్కడ 813 మందికి స్క్రీనింగ్ చేశారు. 176 మందికి ఈసీజీ, 115 మందికి 2డీ ఏకో, 422 మందికి జీఆర్‌బీఎస్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాగా, మేయర్ సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం ఉచితంగా అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ సతీమణి సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రవీందర్ రెడ్డి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జగన్ మోహన్‌రావు, ఎండోక్రైనాలజీ డాక్టర్ కొండ చైతన్య, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ శ్రవణ్ కుమార్, పల్మనాలజీ డాక్టర్ సీఎన్ ప్రసాద్, గ్యాస్ట్రోఎంట్రాలజీ డాక్టర్ ప్రణీత్, లయన్ డాక్టర్ దిలీప్ రావు, ప్రతిమ హాస్పిటల్ రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటర్ పీ ప్రసాద్ రావు, జిల్లా గవర్నర్ లయన్ హెచ్ రాజిరెడ్డి, లయన్ నారాయణరెడ్డి, ఎఫ్‌వీడీజీ వెంకటేశ్వర రావు, ఎస్‌వీడీజీ ఎస్ కోదండరాం, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వీ నరేందర్‌రెడ్డి, డీసీఎస్ వెంకట రమణారెడ్డి ఉన్నారు.

# కక్ష సాధింపులకు భయపడొద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, వేదికపై మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, తదితరులు

- కాంగ్రెస్ ఇబ్బంది పెట్టాలని చూస్తోంది
- బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం
- రాబోయే రోజుల్లో మరింత బలమైన శక్తిగా నిలబడుతాం
- బీఆర్ఎస్ అంటే కాంగ్రెస్, బీజేపీకి వణుకు
- మీ అందరి కృషితోనే మరోసారి గెలిచా
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ఆరు గ్యారంటీలపై వెంటనే జీవోలు ఇవ్వాలి : మాజీ ఎంపీ వినోద్‌కుమార్
- కరీంనగర్‌లో నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 21: 'కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై కక్ష సాధింపులకు దిగుతున్నది. ఇబ్బంది పెట్టాలని చూస్తోంది. కార్యకర్తలకు నేనొక్కటే చెబుతున్నా. ఎవరూ భయపడొద్దు. మీ అందరికీ పార్టీ అండగా నిలుస్తుంది' అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ భరోసానిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించిన కరీంనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు, నాయకుల కృషి వల్లే తాను మరోసారి గెలిచానని, అందుకు రుణపడి ఉంటానని, ఏ అవసరం వచ్చినా అన్ని విధాలా అండగా నిలుస్తామన్నారు. కాంగ్రెస్ హామీలన్నీ నెరవేర్చేదాకా ప్రజల పక్షాల నిలబడుతామన్నారు. ఎంపీ ఎన్నికల్లో మరింత కసితో పని చేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అంటేనే కాంగ్రెస్, బీజేపీలకు భయం పట్టుకున్నదని, ఈ క్రమంలో రాష్ట్రంలో పార్టీని లేకుండా చేయాలని కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ మరింత బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. జనవరిలోనే పంట పొలాలకు సాగునీరందించలేకపోతున్నారని, నియోజకవర్గంలోని పలు చెరువుల్లో కూడా నీరు లేదన్న ఆయన, ఇప్పుడే ఇలా అయితే వేసవిని, యాసంగిని ఎలాగట్టెక్కిస్తారని ప్రశ్నించారు. పరిస్థితులు చూసి రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, ఎంపీపీ పిల్లి శ్రీలత, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, జమీలొద్దీన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు

### గ్యారెంటీలపై జీవోలు ఇవ్వాలి: మాజీ ఎంపీ వినోద్‌కుమార్

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే వాటికి సంబంధించిన జీవోలు ఇవ్వాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. వాళ్లు అన్నట్టు 100 రోజుల లెక్క చూస్తే ఎంపీ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి తప్పించుకునే అవకాశం ఉందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేశామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అలాంటి ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం బీఆర్ఎస్‌కు లేదని, ప్రజలే ఆ నిర్ణయాన్ని తీసుకుంటారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తేవాల్సిన అవసరం ఉందన్నారు.



దేశంలో పదేండ్లు మోదీ ప్రధానిగా ఉన్నారని, ఇందులో ఐదేళ్లు తాను, ఐదేండ్లు బండి సంజయ్‌కుమార్ ఎంపీగా ఉన్నారని, తాను నగరాభివృద్ధికి రూ.1000 కోట్లు తీసుకొస్తే, బండి సంజయ్ మాత్రం ఐదు రూపాయలైనా తెచ్చారా..? చెప్పాలని సవాల్ విసిరారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ విషయంలోనూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఆర్వోబీ కోసం కేంద్రానికి విన్నవిస్తే ఇక్కడ ట్రాఫిక్ లేదని మంజూరు చేయలేదన్నారు. అయితే, ఆ ప్రాంతం కార్పొరేషన్ పరిధిలో ఉంటే మంజూరు చేయాలన్న నిబంధన ఉందని తెలుసుకొని దీని కోసం తాము తీగలగుట్టపల్లి గ్రామాన్ని కరీంనగర్‌లో విలీనం చేసి ఆర్వోబీ తెచ్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి కూడా కేంద్రం ప్రత్యేకంగా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. కొత్తపల్లి సమీపంలో ట్రిబుల్ ఐటీ కోసం 50 ఎకరాలను తాము సిద్ధంగా ఉంచామని, బీజేపీ ప్రభుత్వం మంజూరు ఇవ్వకపోవడంతో ప్రస్తుతం మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు.

**వలేసి పెద్దపులిని పడతరా?**

పులి బయటకు వస్తే వలేసి బంధిస్తామని కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం లండన్‌లో చేసిన వ్యాఖ్యలకు కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ గట్టి కౌంటర్ ఇచ్చారు. 'ఎవరైనా పులిని వల వేసి బంధిస్తారా.. వలలో కుందేళ్లను పడతారు.. పులిని పట్టుకునేందుకు ట్రంక్విలయర్స్ రూపంలో మత్తు మందు ఇస్తారు.. నోరుంది కదా అని రేవంత్‌రెడ్డి ఏది పడితే అది మాట్లాడుతుండు' అంటూ ఎద్దేవా చేశారు. ప్రగల్భాలు మానుకొని రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టాలని చురకలంటించారు.

### బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి



వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలి. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణలో, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికీ వివరించాలి. ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తీరును ప్రజల్లో ఎండగట్టాలి. వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్న సమయంలో కేంద్రం నుంచి ఎన్నో ప్రాజెక్టులను తెచ్చారు. కానీ బండి సంజయ్ ఒక్క రూపాయి కూడా తేలేదు. కేంద్రంలో ఉన్నది వాళ్ల ప్రభుత్వమే అయినా పైసా పనిచేయలేకపోయాడు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించాలి.

\- జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

### బీఆర్ఎస్ వల్లే అభివృద్ధి సాధ్యం



కరీంనగర్‌లో అభివృద్ధి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కృషి వల్లే సాధ్యమైంది. ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తీసుకురాగలిగారు. దీని వల్ల వందల కోట్ల నిధులు రావడంతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. బీఆర్ఎస్ కార్యకర్తల కృషి వల్ల గంగుల కమలాకర్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పోరాడి నిధులు తీసుకువచ్చే సత్తా ఆయనకు ఉంది. వీరికి తోడు ఎంపీగా వినోద్‌కుమార్ ఉంటే మరిన్ని నిధులు వస్తాయి.

\- యాదగిరి సునీల్‌రావు, కరీంనగర్ మేయర్

## 'గుమ్మడి'తో రామమందిరం

**కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్ అద్భుతం**



అయోధ్య రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠన వేళ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్ అద్భుతాన్ని ఆవిష్కరించారు. రెండు గుమ్మడి కాయలు, అర కిలో క్యారెట్లతో 12 అంగులాల ఎత్తు, 16 అంగులాల పొడవుతో నాలుగు గంటలు శ్రమించి ఆదివారం రామమందిరాన్ని నిర్మించారు. అనిల్ గతంలో పుచ్చకాయపై కేసీఆర్, కేటీఆర్, రైతుబంధుపై చిత్రపటాలు, శివుడి ప్రతిమలకు చెక్కి ఆశ్చర్యపరిచారు. - ఎల్లారెడ్డిపేట, జనవరి 21




పక్క రాష్ట్రాల కూలీలకు ఉపాధి కార్ఖానాగా మారిన తెలంగాణ, అక్కడి యువకులకు బతుకుదెరువు చూపుతున్నది. ఇందుకు ఈ చిత్రమే నిదర్శనంగా నిలుస్తున్నది. బిహార్‌కు చెందిన వీరు, అక్కడ ఉపాధి లేక ఆగమైపోయారు. తమకు తెలిసిన బుట్ట కుర్చీల తయారీని నమ్ముకొని కొన్ని నెలల క్రితం కరీంనగర్ జిల్లాకు వచ్చి జీవనోపాధి పొందుతున్నారు. బుధవారం అల్గునూర్–మానకొండూర్ రహదారి మధ్యలో ఊరి పక్కన అక్కడే కుర్చీలు తయారు చేసి విక్రయిస్తూ 'నమస్తే కెమెరా'కు చిక్కారు.

\- కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్






## రాములోరి దర్శనానికి స్పెషల్ రైళ్లు

**ఈ నెల 29 నుంచి మార్చి 3 దాకా సేవలు**

అయోధ్య శ్రీ రామమందిరం ప్రారంభం, విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 22న జరుగనుండగా, రైల్వే శాఖ మన రాష్ట్రం నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. ఈ నెల 29 నుంచి వచ్చే మార్చి 3వ తేదీ వరకు అయోధ్య ధాం రైల్వే జంక్షన్‌కు సికింద్రాబాద్, ఖాజీపేట, జాల్నా నుంచి ఆస్థా స్పెషల్ సర్వీసులు నడపాలని నిర్ణయించి, వాటి వివరాలు వెల్లడించింది. - పెద్దపల్లి, జనవరి 21 (నమస్తే తెలంగాణ)

**జాల్నా నుంచి..**

జాల్నా నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు (వయా పర్భని– పూర్ణా– నాందేడ్– నిజామాబాద్– కరీంనగర్– పెద్దపల్లి– బల్లార్షా మీదుగా) రైలు నంబర్ (07649) ఫిబ్రవరి 4న నడుస్తుంది. ఉదయం 9:30 గంటలకు జాల్నా రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి బాసరకు మధ్యాహ్నం 3:15 గంటలకు, నిజామాబాద్‌కు సాయంత్రం 4కు, కోరుట్లకు 5:18కు, లింగంపేట్ జగిత్యాలకు 5:50కు, కరీంనగర్ రైల్వేస్టేషన్‌కి 6:45కు, పెద్దపల్లి జంక్షన్‌కి 7:35కు, రామగుండానికి 8గంటలకు చేరుకొని 6న ఉదయం 3:35 గంటలకు అయోధ్య చేరుకోనున్నది. ఇక అయోధ్య ధాం జంక్షన్ నుంచి జాల్నా వరకు రైలు నంబర్ (07650) ఫిబ్రవరి 6న నడుస్తుంది. అక్కడ మధ్యాహ్నం 2:20 గంటలకు బయలు దేరి మరుసటి రోజు శుక్రవారం ఉదయం 6 గంటలకు జాల్నా రైల్వే స్టేషన్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో రామగుండానికి సాయంత్రం 7:25 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కి 7:55కు, కరీంనగర్ రైల్వే స్టేషన్‌కి రాత్రి 8:35కు, లింగంపేట్ జగిత్యాల రైల్వే స్టేషన్‌కు రాత్రి 9:20కు, కోరుట్లకు రాత్రి 9:50కు, నిజామాబాద్ జంక్షన్‌కి రాత్రి 11:10కు, బాసర రైల్వే స్టేషన్‌కు 11:53 గంటలకు చేరుకుంటుంది. మరుసటి రోజు 6 గంటలకు జాల్నా రైల్వే స్టేషన్‌కి చేరుకుంటుంది. ఈ రైళ్లలో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2 సాధారణ బోగీలు ఉండనున్నాయి.

**సికింద్రాబాద్ జంక్షన్ పరిధిలో..**

సికింద్రాబాద్ జంక్షన్ నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు రైలు నంబర్ (07221)ను నడుపనున్నారు. ఇది ఈ నెల 29వ నుంచి ఫిబ్రవరి 29వ తేదీ మధ్య వారంలో మూడు రోజుల (మొత్తం 16ట్రిప్‌లు)పాటు నడుస్తుంది. ఇది జనవరి 29, 31, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీల్లో సాయంత్రం 4:45 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి బయలుదేరుతుంది. మార్గమధ్యంలో కాజీపేట జంక్షన్‌కి సాయంత్రం 6:20 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కి రాత్రి 7:38కు, రామగుండానికి రాత్రి 8 గంటలకు వచ్చి, రెండ్రోజుల ప్రయాణం తర్వాత ఉదయం 3:30 గంటలకు అయోధ్యకు చేరుకుంటుంది. తిరిగి అయోధ్య నుంచి సికింద్రాబాద్ జంక్షన్ వరకు రైలు (07222) ఫిబ్రవరి 1, 3, 5, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, మార్చి 1, 3 తేదీల్లో నడుస్తుంది. ఇది అయోధ్య నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలు దేరి, మరుసటి రోజు రాత్రి 10:30 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో రామగుండానికి సాయంత్రం 06:30, పెద్దపల్లి జంక్షన్‌కి 7కు, కాజీపేట జంక్షన్‌కి 8:08 గంటలకు చేరుకుంటుంది.

**కాజీపేట జంక్షన్ పరిధిలో..**

కాజీపేట నుంచి అయోధ్య ధాం జంక్షన్ రైల్వే స్టేషన్‌కు రైలు నంబర్ (07223) ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు వారంలో మూడు రోజులు (మొత్తం 15ట్రిప్‌లు) నడుస్తాయి. జనవరి 30, ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో ఖాజీపేట జంక్షన్ నుంచి సాయంత్రం 06:20 గంటలకు బయలుదేరుతుంది. పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:38కు, రామగుండానికి 8 గంటలకు చేరుకుంటుంది. రెండ్రోజుల ప్రయాణం తర్వాత ఉదయం 3:35 గంటలకు అయోధ్య జంక్షన్ చేరుకుంటుంది. ఇక అయోధ్య జంక్షన్ నుంచి కాజీపేట జంక్షన్‌కు రైలు నంబర్ (07224) ఫిబ్రవరి 2, 4, 6, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీల్లో, మార్చి 2న (మొత్తం15 ట్రిప్‌లు) నడుస్తాయి. ఇది అయోధ్య నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్ చేరుకుంటుంది.







## కరీంనగర్ కార్పొరేషన్ ఎస్ఈ సరెండర్

కార్పొరేషన్, జనవరి 21: కరీంనగర్ కార్పొరేషన్‌లో ఎస్ఈగా పనిచేస్తున్న నాగమల్లేశ్వర్ రావు ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు రావడం, బల్దియాలో బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి లాస్ట్ పే సర్టిఫికేట్ (ఎల్‌పీసీ) సమర్పించకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. 2022 జనవరిలో ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఇప్పటి వరకు ఎల్‌పీసీ ఇవ్వకపోవడంతో జీతభత్యాలు తీసుకోవడం లేదు. దీనిపై ఇటీవల పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో ఆయనకు నోటీసులు జారీ చేశారు. దీనికి సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఎస్ఈని పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు సరెండర్ చేశారు.

## శ్రీరాముడి జెండాలు @ సిరిసిల్ల

- ఇక్కడి నేతన్నకు రూ.2 కోట్ల విలువైన ఆర్డర్లు
- ఐదు రాష్ట్రాలకు ఎగుమతులు

రాజన్న సిరిసిల్ల, జనవరి 21 (నమస్తే తెలంగాణ): అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో సిరిసిల్ల నేతన్నలు శ్రీరాముడి జెండాల తయారీలో నిమగ్నమయ్యారు. ఇటీవలే ఇక్కడి నేత కార్మికుడు అయోధ్య రామ్‌లల్లాకు బంగారు చీరను బహూకరించాడు. ప్రతి ఇంటిపై కాషాయ జెండా ఎగురవేయాలన్న అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్ట్ పిలుపు మేరకు వివిధ రాష్ట్రాలకు చెందిన హిందూ ధార్మిక సంస్థలు సుమారు రూ. 2 కోట్ల విలువైన జెండాల తయారీ ఆర్డర్లు ఇచ్చాయి. శ్రీరాముడు, ఆంజనేయుడు, ఓంకారంతో ముద్రించిన జెండాలు, కండువాల తయారిలో వందలాది మందికి ఉపాధి లభించింది. సోమవారం శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ ఉన్నందునా ఇప్పటికే నేత కార్మికులు కళా నైపుణ్యంతో జెండాలు, కండువాలు తయారు చేశారు. కర్నాటక, మహరాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి చేశారు. నెలరోజులుగా జెండాల తయారీతో రోజుకూ రూ. 800 నుంచి రూ. వెయ్యిదాకా సంపాదించామని పలువురు కార్మికులు చెప్పారు.


సిరిసిల్లలో తయారైన శ్రీరాముడి ఫొటోతో కూడిన కండువాలు

## జాతీయ ఉషు పోటీలకు జిల్లా క్రీడాకారులు

కొత్తపల్లి, జనవరి 21: జార్ఖండ్ రాష్ట్రం రాంచిలో ఈనెల 24 నుంచి జరిగే ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి ఉషు పోటీలకు జిల్లా క్రీడాకారులు హరి చంద్ర ప్రసాద్, స్వప్నిక్, అక్షిత, శ్రీనిధి ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్ తెలిపారు. క్రీడాకారులను ఎస్జీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య, శ్రీనివాస్, ఎడవెల్లి విజయేందర్ రెడ్డి, సుశాంక్‌రెడ్డి, విక్రం గాంధీ, నౌశిన్ అభినందించారు. రాష్ట్ర జట్టుకు కోచ్, మేనేజర్‌గా గంభీరావుపేట మండలానికి చెందిన బార రాణావిక్రం గాంధీ ఎంపికయ్యాడు.


రాణావిక్రం గాంధీ

